# నిన్ను గురించిన నిజం !

"స్మర సమరోచిత విరచిత వేశా
గళిత కుసుమ దర విలులిత కేశా
హరి పరిరంభణ వలిత వికారా
కుచ కలశోపరి తరళిత హారా
విచల దలక లలితానన చంద్రా
తదధర పాన రభస కృత తంద్రా
చంచల కుండల లలిత కపోలా
ముఖరిత రశన జఘన గతిలోలా !"

చుట్టూ చీకట్లు విరియబోసు కుంటున్నాయి ... కిటికీలో నుండి వెచ్చనిగాలి, రంయ్యిన తాకి, రొదపెట్టి, గోడలకు కొట్టు కొని ఎగిసిపోతూ ఉంది. వసంతరాగంతో బాటు జయదేవాష్టపది గీతం తెరపి వెన్నెలలా మనస్సును వెర్రులెత్తింప చేస్తూ ఉంది

రామనాథం ఇక చదవలేక పోయాడు. పేజీలు తిరిగి పోతున్నాయి. కాని ఒక్కటీ బుర్రకెక్కడం లేదు. అక్షరాలకు బదులు, ఏవో బొమ్మలు కళ్ళముందు మెదులుతున్నాయి ... ఏవో జ్ఞాపకాలు ఉవ్వెత్తున మేలుకొని అల్లరిచేస్తున్నాయి ... ఎవరో తనను, మెత్తగా ఆలింగనం చేసుకొన్నట్టూ, తను, చేతులను తడిమి చూసి, కాదు — చూసే వొంకతో — మెల్లగా వేళ్ళను పైకి జరిపి, రెండు చెక్కిళ్ళను గోముగా తాకి, ముందుకు వొంచి, తన బుగ్గలకు ఆనించుకొని ...

"చంచల కుండల లలిత కపోలా
ముఖరిత రశన జఘన గతిలోలా."

మళ్ళీ వసంతరాగం తొడుక్కొని గాలివాలున పాట విని పించింది ... రామనాథం కళ్ళముందు బొమ్మ చెదరి పోయింది ఒక్కసారి ప్రక్కకు చూశాడు. భార్య అప్పటికే, గాఢంగా నిద్ర పోతూ ఉంది. రవికముడి ఊడి రెండు పాయలై ఉన్నది. చంటివాడు పాలు చప్పరిస్తున్నాడు. పొట్టమీది ముడతల్లోని చెమటజీర వెలుతురుకు, వెండితీగలా మిలమిల మంటోంది. చిన్నతనంలో బొడ్డుచుట్టూ పెట్టిన వాతలు, వయస్సుతో బాటు పెరిగి, వికారంగా కనిపిస్తున్నాయి. పిక్కలమీద అప్పుడే మానుతున్న కురుపు, నల్లగా, కరుడు గట్టిపోయింది...

భార్యవైపు చూసి గట్టిగా నిట్టూర్పు విడిచాడు రామనాథం. మొదట — తను రాధను చేసు కొంటాననుకో లేదు. కానీ చేసు కొన్నాడు. చేసుకొన్న తరువాత గూడా ఆమెతో తను కాపరం చేదామనుకో లేదు. కొసకు ఆ పనీ చేశాడు. బిడ్డల తండ్రిగూడా అయ్యాడు. అసలిదంతా తనెందుకు చేశాడు ? ఎవరికోసంచేశాడు ? ఈ ప్రశ్నలు అనేకసార్లు తనను జవాబుకోసం బాధించాయి. తనకు నచ్చిన సమాధానం ఒక్కటీ చెప్పుకోలేక పోయాడు. ఇదంతా తనకు సంబంధించింది కాదనీ, ఎవరికో జరుగుతున్నదనీ, తను భావించాడు. తను కేవలం సాక్షీ మాత్రుడుగానే ఉండిపోతున్నా ననుకొన్నాడు.

ఒక్కో అదృష్టవంతుడు జీవితంలో — అనుకొన్నవన్నీ సాధించుతాడు. తనలాంటి దురదృష్టవంతుడు ఏదన్నా చేదామని గూడా అనుకోడు. కర్మగాలి అనుకొన్నాడో — అది ఆ జన్మలో చెయ్యలేడు. చేదా మనుకొన్నవి చెయ్యలేక పోవడానికీ, చెయ్య గూడ దనుకొన్నవి విధిగా చేసి తీరడానికీ — భౌతికేతర కారణా లేమన్నా ఉన్నాయేమో ?

అయితే గియితే, అన్నీ సక్రమంగా జరిగితే — తను సుమిత్రను చేసుకొని ఉండవలసింది! చేసుకొని ఉన్నట్లయితే, తన బ్రతుకు ఇంకోలా ఉండేది! ఆమె జీవితం గూడా మరోలా ఉండేది. అవును గానీ సుమిత్రను తనెందుకు పెళ్ళాడలేక పోయాడు? ఈ ప్రశ్నకు ఇప్పటికీ జవాబు దొరకదు. బహుశ సుమిత్ర జీవించి ఉంటే — ఉండాలనే తనాశిస్తున్నాడు; ఆమెకూ ఇదే ప్రశ్న స్ఫురిస్తే — ఆమెగ్గూడా జవాబు దొరకదేమో? అలా అనుకొంటేనే తనకానందం! సంతృప్తికరమైన సమాధానం సుమిత్రకు లభించే ఉంటుందని తనెప్పుడూ ఆలోచించలేదు. అలా ఆలోచించడం తన కిష్టం లేదు గూడానూ!

1956లో గావును — అవును 56 లోనే — మొట్ట మొదట తను సుమిత్రను చూశాడు. ఆ ప్రయాణంలో సుమిత్రను కలుసుకో వచ్చునని తాను అనుకోలేదు. అప్పటికి నాలుగేళ్ళ నుండి తాను హైదరాబాద్‌లోనే ఉంటున్నాడు. ఉన్నా తను గోల్కొండ చూడనేలేదు. ప్రతిసారీ ప్రయాణం కావడమూ, ఏదో వో కుంటిసాకు తనకు తాను కల్పించుకొని, మానుకోవడమూ జరిగింది... ఏదో వో పత్రికలో గోల్కొండను గురించి చదివాడు. చూడాలని ప్రయాణమయ్యాడు. దూరానికి ఉత్తికొండలా కనిపించే ఆ ప్రదేశం దగ్గర ఉండి చూశాక దిమ్మెర పోయాడు. యవ్వనమంతా, గడచి, వృద్ధాప్యంలో అడుగు పెట్టిన సౌందర్యరాశిలా, శిధిలాతి శిధిలమైన గోల్కొండ కోట తనకు కనిపించింది.! ఫతే దర్వాజానుండి లోపలి కెళ్ళాడు. బాలాహిసార్ ద్వారం దాటి అందరిలాగా మండపం మధ్య నిలబడి, చప్పట్లు చరిచి, వాటి ప్రతిధ్వని తరంగాలను విన్నాడు. తనలాగానే, ప్రకంపిత ధ్వని తరంగాలను వినడానికి వచ్చినవారు చాలా మంది ఉన్నారు, వారిలోనే మొట్ట మొదట తను సుమిత్రను చూసినట్టు జ్ఞాపకం ...

"మీరు తెలుగువాళ్ళా?"

చక్కని తెలుగు నుడికారం క్షణకాలం తనను ఆకట్టినట్ల యింది. ఆ మాట వచ్చిన వేపుకు చూశాడు. పదిమంది అమ్మాయిలు గుంపుగా అక్కడ నిలబడి ఉన్నారు. అందులో తనను పలకరిం చింది ఎవరో తెలుసుకోలేక పోయాడు. తనను కాదేమో? అయినా— తన్నే పిలిచారని తనెందు కనుకొన్నాడు? వాళ్ళు అమ్మాయిలు గనకనా? అందంగా ఉన్నారు గనకనా?

అందరికళ్ళూ వెదికి, గిరుక్కున వెనక్కు తిరిగి, సిగరెట్ ముట్టించుకొని, 'శిలాహ్‌ఖానా' కేసి వెళ్ళాడు. నేలంతా బుసికతో నిండిపోయింది. వేలాది పదచిహ్నాలు చిక్కిరి బిక్కిరిగా, చెల్లాచెద రుగా ఉన్నాయి. ఆయుధాగారాన్ని ఈ కొసనుండి ఆ కొసదాకా తిరిగి చూశాడు. తుప్పు పట్టి, విరగడానికి సిద్ధంగా ఉన్న, ఆనాటి తుపాకులను తాకి చూశాడు. తనకు గుండెలనిండుగా రక్తం పొంగి పోతున్నట్లనిపించింది! ఈ తుపాకిని ఎంతమంది సైనికులు వాడారో, ఎందరు ఆమాయికులను ఇది భయపెట్టిందో, అంతిమ ఘడియల్లో కోటను రక్షించడానికి ఎన్ని అగ్నిగోళాలను విరజిమ్మిందో - బహుశా ఎక్కడా లిఖింపబడి ఉండదు. కానీ ఈ నాటికిది దిక్కుమాలిన దశలో కాపలావాడు, గోచిగుడ్డ ఆరేసు కొనేందుకు మాత్రం పనికొస్తోంది.

అటుకేసి కొండనెక్కడం కష్టమన్నారు ఎవరో! వెనక్కు తిరిగి, 'నగీనాబాగ్' దిక్కుకొచ్చాడు. ఉప్పుసెనగలు చప్పరిస్తూ సుమిత్ర తనకక్కడ మళ్ళా కనిపించింది. ఇప్పుడామె చుట్టూ, మహిళామండలి లేదు. కూలిపోబోతున్న గోడ అంచున, రాతి మీద వారగా కూచుని, తోచక గావును, కాళ్ళాడిస్తోంది సుమిత్ర.

"మీరు తెలుగువాళ్లే కదండీ?"

చుట్టూచూసి, తననేనని రూఢి చేసుకొన్నాక, ఆమెకల్లంత దూరంలో నిలబడి, "అవును. మరి మీరో?" అన్నాడు తను.

సుమిత్ర విచ్చిన మందారంలా ఫక్కున నవ్వింది.

"ఆంధ్రులం!"

తనూ నవ్వాడు సిగ్గుపడి. అంత చక్కని తెలుగు మాట్లాడటం వినిగూడా; తనలా ఎందుకడిగాడో తెలీదు మరి.

"మీ స్నేహితులంతా ఏరీ?" అన్నాడు.

"స్నేహితు లెవరు?"

"ఇందాక మీ చుట్టూ ఉన్నవాళ్ళు

"ముందు వెళ్ళారు. నే నొక్కదాన్నే మిగిలిపోయాను".

"నడవలేక పోయారా ?"

"మీ రనేదాకా నడవటం శ్రమ అన్న సంగతి నాకు తట్టలేదు. నే నాగింది, ఈ తోటను చూడటానికి !" అన్నది సుమిత్ర.

"ఇప్పు డిక్కడేమీ లేదే !"

"కానీ ఒకప్పుడుండేది ! గోల్కొండ నవాబుల కాలంలో— ఆ వాతావరణం ఊహించుకొంటే - ఆ తోట ఎంత అందంగా ఉంటుందో తెలుసుకోగలం ... లోకం, ప్రజలు, దేవుడు, కరువు, యుద్ధం, భయం, వ్యాధులు — ఇలాంటివన్నీ వారికి స్వల్పకారణాలుగా కనిపించేవేమో ! కాబట్టే, అందాన్ని, ఆనందాన్ని,

అనుభవించగలిగారు. లోకం పట్ల ఆ నిర్లక్ష్యమే లేకపోతే, ఆనందించడం సాధ్యం కాదేమో ?'' అన్నది సుమిత్ర.

ఇద్దరూ కలిసి, మెట్లమీదుగా పైకి ఎక్కుతున్నారు. ఎడం వైపున రాతిగోడలు, కుడివైపున కొండరాళ్ళు, వాటిమధ్య, నీటికోసం కేకలేసి, చచ్చిపోయిన గడ్డిపూచలు, కదిలిన రాతిమెట్లు, మధ్య మధ్య అగ్గిపుల్లలు, సిగరెట్ ముక్కలు, ఎర్రని ఉమ్మి చారలు ...

"ఈ మెట్లమీదుగా ఎందరు నవాబులు నడిచారో చెప్పలేను. ఈ మార్గం ఒకప్పుడు సువాసనలతో నిండిపోయేదేమో ! ఈ మెట్ల మీదుగానే నవాబుల జనానాకోసం, స్త్రీలు తీసుకెళ్ళబడుతుండే వారేమో ? ఎన్నివేల మంది అందం ఈ కొండమీద వికసించి, విప్పారి, పరిమళాలను గుబాళించి, ఇక్కడే నాశనమయిందో చెప్పలేం ! అదంతా తలుచుకొంటుంటే మనస్సు ఝల్లుమనడం లేదూ ?'' ఓ మెట్టుమీద ఆగి, రొప్పు తీర్చుకొంటూ అన్నది సుమిత్ర.

తను ఆమెకేసి చిత్రంగా చూశాడు. కొండగాలి రాతికేసి తలబాదుకొని, గొల్లుమని గోల కెత్తుతోంది ... తొండ తలెత్తి తమకేసి చూసి, నడుం అందంగా కదిపి, ఛర్రున నెరియలోకి మాయమయింది. ...

చిన్న రాతిమీదుగా దూకి, రామదాసు చెరసాలను చూశారు.

"దేనికయినా పట్టుదల, దీక్ష ఉండాలండీ ! ఈ 'నజర్ ఖానా' లో రామదాసు పన్నెండేళ్ళున్నాట్ట ! ఏదో వో నాటికి తనకీ చెరసాలనుండి విముక్తి లభిస్తుందన్న నమ్మకం రామదాసుకు లేకపోతే, ఎప్పుడో గుండె ఆగి చనిపోయి ఉండేవాడు. ఏమంటారు?'' అన్నది సుమిత్ర.

"రామలక్ష్మణు లొచ్చారనీ, తానీపాకు డబ్బిచ్చి విడిపించారనీ చెప్పుకొంటారు గదూ ?" అన్నాడు తను.

"వచ్చారా, చచ్చారా అన్నది వేరు సంగతి. కానీ వస్తారన్న నమ్మకం, ఆ గాఢ విశ్వాసం సంగతి నే నంటూంట! అదే ఈనాడు మనలో లోపించింది. మనకు ప్రతిదీ సందేహమే! ప్రతిదీ అనుమానమే!! ఏం చేసినా సగం మనస్సుతో చేస్తాం. సగం ఆలోచిస్తాం. సగం అనుభవిస్తాం. సగం బ్రతుకుతాం. సగం తింటాం. కొసకు చావు గూడా సగమే చస్తాం. నిండుగా బ్రతకడమూ చేత కాదు; నిండుగా చావడమూ మనవల్ల కాదు. అర్ధజీవులం. అర్ధ మానవులం ... ఇన్నిటికీ మీ పేరేమిటో చెప్పారు కాదు" అన్నది సుమిత్ర.

"సుమిత్రా రావే!"

కొండమీది నుండి గోలగా కేకలు వినిపించాయి. అప్పుడు తెలిసింది తనకు ఆమె పేరు సుమిత్ర - అని.

"మావాళ్ళంతా పిలుస్తున్నారు. వెళ్ళొస్తాను. మీరూ వస్తారా ఏమిటి? ఇన్నిటికి మీపేరు చెప్పారుకాదు ..." అన్నది తనతో. తన స్నేహితుల కేసి తిరిగి, చెయ్యి గాలిలో ఆడించి, చీరకుచ్చెళ్ళు, అలవోకగా పైకెత్తి పట్టుకొని, తెరచాపలా లేచిపోతున్న పమిట చెంగును, గిర్రున తిరిగివంటికి చుట్టుకొని, కొండరాళ్ళల్లోకి వెళ్ళి పోయింది సుమిత్ర.

ఆమెను తిరిగి చూస్తాననుకో లేదు తను. ఆమె ఎడ్రస్ కనుక్కోనందుకు చాలా విచారించాడు. మనస్సంతా వికలంగా ఉంది. జ్ఞాపకాలు ఉసుళ్ళులా లేచి చిరాకు కలిగిస్తున్నాయి. వంటినిండా ఏదో బాధ ... చెప్పరాని అసంతృప్తి, ఇరుకు, చీకటి

లోపల గిజాటు,.... బొమ్మలు, యుద్ధం — తుపాకుల మోత ఫిరంగి గర్జన ... చల్లని గాలితెరలు ... వందలాది స్త్రీల ఏడుపులు ... అంతా గజిబిజిగా అయోమయంగా ఉంది!

ఉన్నట్టుండి నాలుగువేపులా చీకట్లు కమ్ముకొచ్చాయి. దూరంగా రోడ్డుమీద దుమ్ము ఉవ్వెత్తున పైకి లేచింది. హైదరాబాద్ నుండి నాలుగు టాంకులు తాబేళ్ళలా పాకుతున్నాయి రోడ్డుమీద. నార్సింగ్ నుండి ఓ లారీ వస్తూ వస్తూ దుమ్ములో కలిసిపోయింది. గాలి గొప్ప చప్పుడుతో కొండను నిద్ర లేపుతోంది. కొండ మూలుగుతోంది గానీ కదలడం లేదు ... గడ్డిపోచలు చంటిబిడ్డల్లా విలవిల లాడిపోతున్నాయి ... మేఘాలు కోపంతో అరచి అరచి, దెబ్బలాడు కొంటున్నట్టు ఉరుములు ... ఛణేలుమని మెరిసి కొండను కాంతితో నింపి, ఆకాశం కుండపోతగా వర్షించింది ...

మెరిసినప్పుడు తప్ప, మరేమీ కనిపించడం లేదు. గాలి దెబ్బ లకు మబ్బులు గోండ్రిస్తున్నాయి. రాళ్ళమీద పడి ముక్కలయిన చినుకులు, జాలిగా జారి, రొదలు పెడుతూ కిందికి పారిపోతు న్నాయి...

ఈ దిక్కుమాలిన ఆలోచనల్లో పడి తను కొండదిగడం మర్చి పోయాడు. ఇప్పు డెలా పోవడం? ఎప్పటి కీ వాన వెలిసేట్టు? ఎంత కాలం తనిక్కడుండేట్టు? కళ్ళు చిరతలు పడేలా మెరిసి, ఆ వెంటనే గుండె లదిరేలా ఉరిమింది ఆకాశం!

"రామనాథం గారూ!"

వణికిపోయాడు తను. ఈ భీభత్స సమయంలో తన్నెవరు పిలుస్తున్నారు? తన భ్రమా? దయ్యాలా? చచ్చినవారి ఆత్మలు

దయ్యాలయి తిరుగుతుంటాయట. అవేం కావు గదా? అయినా ఆ తురకదయ్యాలకు తన పేరెలా తెలుసు?

మెల్లగా, తనకు దాపులోనే, అడుగులచప్పుడు వినిపించింది! గుండెలు వణికినట్లయింది. అంత చలిలోనూ చెమటలు పోశాయి తనకు.

"రామనాథం గారేనా?"

సుమిత్ర గొంతు గుర్తించాక, తన ప్రాణం తెరిపికొచ్చింది. క్రమంగా వణుకు కూడా తగ్గిపోయింది. ఈసారయినా అడ్రసు అడగా లనుకొన్నాడు.

"మీరుగూడా వెళ్ళలేదా?" అన్నది సుమిత్ర తనకేసి కదులుతూ.

"లేదు."

సుమిత్ర నిట్టూర్పు విడవటం తనకు వినిపించింది.

"చీకట్లో ఎక్కడున్నారో కనిపించడం లేదు. ఇలా రండి! ఇక్కడి వెచ్చగా ఉంది ... పోనీ నేనే అక్కడకు రానాండి?" అన్నదామె.

"రా" అన్నాడు తను. వచ్చాక "మీరెందు కెళ్ళలేకపోయారమ్మా?" అన్నాడు మరేమనడానికీ తోచక.

"జవాబు చెప్పలేను. ఈ కొండను విడిచి వెళ్ళడానికి మన సొప్పలేదు రామనాథంగారూ! ఇక్కడే, ఇలానే, జీవితాంతం ఉండిపోవాలనిపిస్తోంది. ఈ కోటలో, గతకాలంలో ఉన్నవారి ఆత్మలన్నీ నన్నిక్కడే ఉండిపొమ్మని కోరుతున్నా యనిపిస్తోంది. ఈ శిథిలాలమధ్య కూచుని కళ్ళు మూసుకొని, గత వైభవాన్ని తలుచుకొంటూ, ఆ తీయని భావనలోనే ప్రాణాలు వొదిలెయ్యాలని

సిస్తోంది ... ఇన్నిటికీ మన మిప్పు డెక్కడున్నా మంటారు రామనాథంగారూ ?"

" 'బారాదరి'లో అనుకుంటాను"

క్షణంసేపు ఎవ్వరూ మాట్లాడలేదు. గాలి భోరుమని వీస్తోనే ఉంది. వానమాత్రం కొంత తగ్గిపోయింది. మబ్బులు మెల్లగా విడిలిపోతున్నాయి.

"ఔరంగజేబుతో వైరం రాకుండా ఉన్నట్లయితే గోల్కొండ చరిత్ర మరోలా ఉండేదేమో ! అసలా విరోధం ఎందుకొచ్చిందంటారు రామనాథంగారూ ? మీకేమయిన తెలుసా?" అన్నది సుమిత్ర హఠాత్తుగా.

"విన్నాను ... కానీ నిజమనుకోను ... మీర్ జుమ్లా అనే ఆర్థిస్థాన్ దేశీయుడు వ్యాపారిగా గోల్కొండ వచ్చాడట. త్వర లోనే ముఖ్యమంత్రి పదవిని సంపాదించాడుట. అతని దగ్గర 20 మణుగుల మణి మాణిక్యాలుండేవిట ! ప్రపంచ ప్రసిద్ధిచెందిన కోహినూర్ వజ్రాన్ని షాజహానుకు బహూకరించినవాడు మీర్ జుమ్లా ! ఇతనికీ, అప్పటి సుల్తానయిన అబ్దుల్లా కుతుబ్‌షాకు మధ్య వైరం కలిగింది ... రాజమాత హయ్యత్ బక్షీబేగంతో ఇతనికి రహస్య సంబంధా లుండేవిట. అవి బైట పడడంతో రాజు మంత్రుల మధ్య విరోధం వచ్చింది. మీర్ జుమ్లా ఔరంగజేబును ఆశ్రయించాడు —"

"జుమ్లా అలాచేసి ఉండకూడదు, మరి మీరు చెప్పిందే నిజ మయితే?"

"తప్పుకాదేమో ! హయ్యత్ బక్షీబేగం తప్పుకూడా ఇందులో ఉన్నదనుకొంటాను. ఈనాడు, ఇలా 'బారాదరి' శిథిలా లలో కూచున్న మనం - అప్పటి మంచి చెడ్డలను నిర్ణయించడం

సరి కాదనుకొంటాను. బఖీబేగం లోకోత్తర సౌందర్యరాశి. మీర్ జుమ్లా, అపరచాణుక్యుడు. ఆమె అందం, అలా నాలుగు గోడల మధ్యా ఇంకిపోవడమే మంచిదని నే ననుకోలేను. స్వామిద్రోహం. గోల్కొండ భవిష్యత్తు, అలా ఉంచండి - ఇదెంత ప్రమాదకరమో, వారికి తెలియదా? తెలిసికూడా ఆ సంబంధాన్ని విడవలేకపోవడం దాన్ని మనం అర్థం చేసుకోగలగాలి... ప్రేమించినవారి కోసం, రక్తపాతానికయినా వెనుదీయని యవనరక్తం హయ్యత్ బఖీబేగంలో ఉన్నది ... అదంతే!" అన్నాడు తను...

వాన పూర్తిగా వెలిసిపోయింది. మబ్బులు విడిపోయాయి. గాలి మాత్రం కొండను గట్టిగా కావలించుకొని, గుసగుసలు చెబుతోంది. ఊళ్ళోని దీపాలు చుక్కల్లా మెరుస్తున్నాయి ... చంద్రుడు నెత్తిమీద నవ్వుతున్నాడు.

"చలిగా ఉంది గదూ?"

"చాల..." అని నొక్కిపలికింది సుమిత్ర.

గాలికి ఆమె కుచ్చెళ్ళు గుమ్మటంలా పైకి లేచిపడుతున్నాయి. రెండుచెవలను కమ్ముకొంటున్న వెంట్రుకలు మొఖాన్ని ముద్దాడుతున్నాయి.

"బారాదరీ అంటే?"

"పన్నెండుద్వారాల భవనం" అని అర్థం. ఇది రాజభవనం కూడా. ఇక్కడే సుల్తానులు కూర్చునే వారు ... ఆ రెండూ తారామతి ప్రేమావతి కట్టడాలు. వారిద్దరూ అక్కాచెల్లెళ్ళు. అబ్దుల్లా కుతుబ్‌షా, వారి అందంకోసం, నాట్యంకోసం, రాణులను చేసుకొన్నాడు. 'ఖిల్వాత్' లో వారితో గంటలకు గంటలు గడిపేవాడట. ఖిల్వాత్ దాపులోనే, ఒకప్పుడు చలువరాతితో నిర్మించిన

చిన్న సరస్సు ఉండేదట! దాన్నిండా గులాబీల అత్తరులు నింపి తన ప్రియురాళ్ళతో, ఆ సరస్సులో అబ్దుల్ కుతుబ్ షా జలక్రీడ లాడేవాడట . ."

"అబ్బ" అని క్షణకాలమాగి, "చలి" అన్నది సుమిత్ర మెల్లిగా.

"మీ కెలాఉంది?"

"ఏమిటి?"

కొన్నిక్షణాలు నిశ్శబ్దం గిలగిల లాడిపోయింది.

"ఈ బారాదరిలో ఉంటే?"

"ఈ ప్రపంచమంతా చాలా అల్పంగా, మనం అల్పాతి అల్పంగా ఉన్నా మనిపిస్తోంది."

"భయం వెయ్యడం లేదూ?"

"నీకో?"

"ఇక్కడే ఉండిపోవాలనిపిస్తోంది."

తనేమీ మాట్లాడ లేదు. సుమిత్రకళ్ళు ఛలఛలా మెరిసినట్లని పించింది.

నిట్టూర్పు విడిచాడు తను.

"పైకి వెడదాం. 'షా నషీన్' దగ్గిరికి. సుల్తానులు సాయం వేళల్లో గాయనీబృందంతో, మదిరతో, మదవతులతో అక్కడ సుఖించేవారట."

"తప్పక"

తడుముకొంటూ ముందుగా తను మెట్లెక్కుతున్నాడు. సుమిత్ర తనను వెచ్చగా అనుకొని, చేతులు భుజంమీద వేసి ఎక్కు

తోంది. సుఖంకోసం సర్వస్వం ధారపోసే యవన ప్రభువులు ఇంత ఇరుగ్గా మెట్లెందుకు కట్టారో?

ఓ గబ్బిలం కీచుమంటూ అరిచి, తలమీద తన్ని, గోడలకు తగిలి రివ్వుమని దాటిపోయింది.

"అమ్మో!" అంది సుమిత్ర, తనను గట్టిగా పొదువుకొని.

మెట్లెక్కి పైకి వచ్చాక గట్టిగా నిట్టూర్చింది సుమిత్ర.

"చాలా బావుందిగదూ?

"ఏది?"

సుమిత్ర క్షణకాలం ఆగాక ఫక్కున నవ్వింది.

"షా నషీన్"

తనకెందుకో ఆమాట నిజమనిపించలేదు. బరువుగా చల్లగా కొండను ఆలింగనం చేసుకొని గుసగుసలాడుతున్న గాలి, తెల్లగా లోకాన్ని వెన్నెలతో రంగులు పూస్తున్న చంద్రుడు, గడ్డిపూల మెత్తటి వాసన, ఒంటరితనం, చిన్నహోరు కలిసి, తనను కకావికలు చేసి, పిచ్చివానికింద మార్చేస్తున్నాయి. ఏది ఏమిటో తెలియని దశలో, మైకంలో, ఉద్రేకంలో, ఆవేశంలో, కలలో, నెత్తుటి తిరుగుబాటులో, జిగీషలో తనకు కళ్ళు మూతలు పడిపోయాయి. వంటినిండా మెరుపులు కురిసి విరిసి, పెల్లుబికి, విచ్చులుకున్నట్లనిపించింది. సర్వలోకాలు ఈ క్షణాన ఆనందంతో మూర్ఛనలు పోతున్నట్లనిపించింది. మెలకువో, కలో, అవునో కాదో తెలీని తురీయావస్థ అది!

కల కరిగి పోయింది. మెల్లగా కళ్ళు విడివడ్డాయి. తన చెంపను వెచ్చగా వెదికే సుమిత్ర చెక్కిలి, తన చేతుల్లో చిక్కు

పడిన ఆమె మెత్తని జుత్తు, కళ్ళల్లో చల్లారిన ఆకలి, చిన్న ఆయాసం, వొణికే పెదవి, చిరుచెమట — మళ్ళీ కళ్ళు మూసుకొన్నాడు తను !

అలా పరిచయమయింది సుమిత్ర. తనను ఉదయం ఎండ చత్రుమని కొప్పడితే లేచి కూచున్నాడు తను. ఎవ్వరూ లేరు. నలిగిన నాలుగు చామంతి పూలు, నీలంరంగు గాజుతుంపులు, గుంటల్లో నిలిచిన వాననీరు, గోడమీద నుండి చూస్తున్న ఉడత పిల్ల, తనకేసి నవ్వుతూ చూసినట్లనిపించింది.

సంతోషంతో, దిగులుతో కొండ దిగి వచ్చాడు. దోవ పొడవునా ఒకటే ఆలోచనలు...'ఎం చక్కని కల' అనుకొంటూనే ఉన్నాడు. జేబు తడిమి, వాడినపూలు, గాజుతుంపులూ చూసుకొని గట్టిగా నిట్టూర్చాడు.

వారం తరువాత గానీ మళ్ళీ సుమిత్ర తనకు కనిపించ లేదు. ఈ వారం రోజులూ తను, రాత్రులు సుమిత్ర చుట్టూ కలలు కంటూనే ఉన్నాడు. ఈసారి ఆమె వస్తే - కనీసం చిరునామా అన్నా పుచ్చుకోవా లనుకొన్నాడు.

సుమిత్ర వచ్చాక —

"మళ్ళీ గోల్‌కొండ పోదామా ?" అన్నాడు తను, జ్ఞాపకాలను తట్టి లేపుతో.

"ఎందుకూ ?" మూతిని చిన్నదిగా కుదించి, కళ్ళను విచ్చిలచేసి చూసింది సుమిత్ర.

"మంచి మంచి కలలు కనడానికి."

ఫక్కున నవ్వింది సుమిత్ర.

ఆమె చెక్కిళ్ళు రవంత గండరించినట్లనిపించింది తనకు.

"కలలు కనే శక్తి ఉండాలేగానీ —" అని ఠక్కున ఆగిపోయింది సుమిత్ర.

"కానీ - ఊఁ -" అన్నాడు తను ప్రోత్సహిస్తూ.

అప్పటికీ ఇప్పటికీ ఆ వాక్యం పూర్తి కానేలేదు.

"అన్నీ అంత మంచిచోట్లు ఉంటాయనుకోకు. ఒక్కో ప్రదేశంలో దేవతలు భూమిమీదికి దిగొస్తారు. ఒక్కోచోట మానవులే దానవులౌతారు. కాబట్టి అమ్మాయీ, క్షేత్రమహాత్యం లేదనుకోకు."

దానికి సుమిత్ర ఏం చెప్పిందో తనకు జ్ఞాపకంలేదు. కానీ ఏదో చెప్పే ఉంటుంది. చెప్పటం - సరదాగా మాటలు చెప్పటం - సుమిత్రకు చేతనయినట్లు మరొకరివల్ల కాదని ఇప్పటికీ తననుకొంటూ ఉంటాడు. మామూలు చెత్తమాటలు ఆమెనుండి అందంగా తయారయి వచ్చేవి. ఆమెనోట విన్నదాకా, ఆ మాటల్లో అంత అందమున్నదని గూడా తనకు తెలీదు.

ఆమె అభిప్రాయాలు గూడా చాలా చిత్రంగా ఉండేవి. విపరీతమైన స్వాతంత్ర్యేచ్ఛ ఆమెను నిలువునా దహించి వేస్తున్నట్లు కనిపించేది. ఎప్పుడూ, ఎక్కడా, దేనికీ లొంగని ఆత్మవిశ్వాసం ఆమెలో పొంగులువారుతూ ఉండేది. 'ఆనందం' అన్నదానికి ఆమె ఇచ్చిన నిర్వచనం తనకిప్పటికీ జ్ఞాపకముంది. ఆనందం అమృత భాండం లాంటిదనీ, దానిచుట్టూ రాక్షసులు, దేవతలూ ముసిరారనీ, శతాకోటి అవాంతరాలను గడిచి, దానిని సాధించినవారే, అమృతాన్ని పొందగలరనీ, భీరులు ఆ సాహసం చెయ్యలేక,

శుష్కప్రియాలు వల్లిస్తుంటారనీ సుమిత్రవాదం. జీవితంనుండి, సుఖాన్ని ఏరుకోవాలంటూ ఉండేది సుమిత్ర

అలాంటి సుమిత్ర "రేపు నీకోసం చూస్తూంటానయ్యా రామనాథం" అంటూ వెళ్ళిపోయి మళ్ళీ కనిపించలేదు ... తను వెళ్ళేసరికి గది తలుపులకు తాళాలు వేసున్నాయి.

అప్పటికీ ఇప్పటికీ మధ్యకాలంలో ఒక పంచవర్ష ప్రణాళిక జరిగిపోయింది. విపరీతమైన కసితో పరిస్థితులు వ్యక్తిని హింసించ సాగాయి. జీవితం దిక్కు తోచక శృంగాటకంలో నిలబడి వెర్రిగా కేకలేసింది. నీడలు పదును తేలి, రొప్పుతో బ్రతుకును కమ్ముకొన్నాయి. పగళ్లు, రాత్రులు, నిశ్శబ్దంగా వచ్చి, నీరసంగా వెళ్ళిపోతున్నాయి.

ఏదో జరుగుతుం దనుకొన్నాడు తను. కానీ ఏమీ జరగలేదు. పడిపోయిన శకటాన్ని బాటమీద కెక్కించాడు. విరిగినచోట్ల అతుకులు పడ్డాయి. బండి నడుస్తున్నది. అయితే ఆ నడకలో సుఖంలేదు. హాయిలేదు. కుదుపులు జాస్తి. కిరకిరలు హెచ్చు. అప్పుడప్పుడు అదుకులు ఊడిపోతాయేమో ననిపించేది. అలాంటప్పుడు కొత్తపట్టీలతో, మళ్ళీ నడక ప్రారంభమయ్యేది. మళ్ళీ కుదుపులు, మళ్ళీ అదుకులు ... బతుకంతా ఇదే తంతు.

జ్ఞాపకాల మడతలమీద కాలం పొరలను కప్పేసినా, ఆ పొరలను తొలగించి చూస్తే, మడతలు మిలమిలలాడు తూనే ఉండేవి. అప్పటికీ వాటిపోడిమి మాసిపోలేదు మరి! తనతో తను రాజీపడదామనుకొన్నాడు. భార్యతో, బిడ్డలతో, డబ్బుతో, అధికారంతో, ఉద్యోగంతో, తను జరిపిన రాజీ సంప్రదింపులు ఫలించలేదు, బెడిసికొట్టనూ లేదు. అవి అలానే ఉన్నాయి. తను ఇలానే

ఉన్నాడు. ఏదో అసంతృప్తి, తెలియని కోపం, నిరాశ, చికాకు, గిజాటు, అశాంతి, ఆవేదన, కోత - ఇవి మాత్రం మిగిలాయి. ఒక మనిషి, మరో మనిషి బ్రతుకులో ప్రవేశించి, చేయగలవి ఇంత కన్నా ఉంటాయనుకోలేక పోతున్నాడు తను. కొండలు, వానలు, ఉడతలు, ఒంటరితనం, లేత ఆకుపచ్చనిరంగు - అంటే తనకు అసహ్యం. ఇవన్నీ సుమిత్రను జ్ఞాపకం చేసి, శాంతిని హరించి, తనను కకావికలు చేసి వేస్తాయి.

"విచల దలక లలితానన చంద్రా
త దధర పాన రభస కృత చంద్రా
చంచల కుండల లలిత కపోలా
ముఖరిత రశన జఘన గతి లోలా!!"

కొరడాతో ఛణేలుమని చరిచినట్లు జివ్వుమని లేచి కూచు న్నాడు రామనాథం.

"హమ్మయ్య ! ఇప్పటికన్నా లేచారు. మీకోసం సుమిత్ర గూడా కాఫీ తాక్కుండా కూచుంది. తొరగా పళ్ళుతోముకొస్తే -" అని కేకేసింది రాధ.

"ఇదో!" అన్నాడు రామనాథం —

తుండుగుడ్డ భుజాన వేసుకొని బావి దగ్గరకెడుదూ. రాధ, ఎసరుపోసి, సరిపోయిందో లేదో వేళ్ళతో కొలిచి చూస్తోంది. సుమిత్ర ఫ్లాస్కు దగ్గర బాసీపట్టు వేసుక్కూచుంది. అప్రయత్నంగా కూతురిమీద అప్యాయత పుట్టుకొచ్చింది రామనాథానికి. కూతుర్ని ఆప్యాళంగా ఎత్తుకొని, గిరగిరా తిప్పి, బుగ్గమీద గరుకు గడ్డంతో వొత్తాడు.

"చక్కలిగిలి" అంటూ సుమీ గిలగిలలాడి పోయింది.

"ఎంగిలిసుళ్ళు లేస్తాయి బాబూ! మీరు ముఖం కడుక్కుని రాగూడదూ!" అన్నది రాధ, ముసిముసిగా నవ్వి, మసిగుడ్డతో చేతులు తుడుచుకొంటూ.

కాఫీ తాగుతున్నప్పుడు భార్య నడిగాడు రామనాథం.

"చుట్టాలొచ్చారేమో తెలీదు."

"కొంచెం కనుక్కో" అన్నాడు రామనాథం.

రాధ భర్తముఖంలోకి అయోమయంగా చూసింది.

"మరేంలేదు." అన్నాడు రామనాథం. కూతురు, పెదిమ కంటిన కాఫీచుక్కను వేలితో తుడిచివేస్తూ. "నెలమధ్యగదా! పాపం ఆ శేషగిరి ఎంత ఇబ్బంది పడుతున్నాడోనని -"

ఆఫీసుకెళ్ళి కూడా మనస్సు బావోక సెలవు తీసుకొని, అలా నాలుగు వీధులూ తిరిగి, ఇంటికొచ్చాడు రామనాథం. తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి. సుమి శేషగిరి కూతురు పిల్లెమ్మతో ఆడుకొంటోంది. ఓ క్షణం కూతురుకేసి చూసి, విసుగ్గా, తల గోక్కొని లోపలికొచ్చాడు. మనస్సంతా మబ్బు కమ్మినట్టు మసగ్గా అయిపోయింది. ఆడవారు గొడవగా ఏవో మాట్లాడుకొంటున్నారు. ఆ గోలలోంచి ఓ కంఠం తన నరాలను మెలిపెట్టినట్లయింది.

"స్మర సమరోచిత విరచిత వేశా
గళిత కుసుమ దర విలులిత కేశా..."

నెత్తురు ఎగసిపోతునట్లనిపించి గిజగిజలాడి పోయాడు రామనాథం! ఆ కంఠం తనకు తెలుసు. పానషీన్‌లో, ఒంటరి

తనంలో, చెట్లనీడలలో, చిన్ని అలలలో, కలలలో తనను వెంటాడి, బ్రతుకునిండా నిండిపోయిందది. తనకు శాంతి లేకుండా చేసిందది! జీవితాన్ని కల్లోలమయం చేసిందది ! ఆ కంఠం కోసమే తను నిరంతరం అన్వేషిస్తున్నాడు.

పక్కమీద బోర్లగిలపడి దిండులో తల దాచుకొన్నాడు రామనాథం. శరీరమంతా శ్రవణేంద్రియమై పాటను జుబ్బన జూరలుగా గ్రహిస్తున్నది.

"ఎంతసేపయిందండి వచ్చి ? అదేమిటి" అంటూ రాధ, భర్త వెన్నుమీద చెయ్యివేసి చూసింది.

"నాన్నోవ్ ! మలేం — నాకేం —" అంటూ ఏదో చెప్పబోయి, నాన్నముఖం చూసి ఆగిపోయింది సుమి.

"అప్పుడే వచ్చారేం ?"

"బావోలేదు" అన్నాడు రామనాథం.

సుమి నిమ్మళంగా చప్పరిస్తూ వెళ్ళిపోయింది.

"మీరొచ్చారని అమ్మాయి చెబుతేనూ -" అని ఆగి, "పోనీ కాఫీ పెట్టనా ?" అన్నది రాధ.

"వొద్దే ! నన్నిలా ఉండనీ !"

"పులిక తగిలి కన్ను మూస్తారా ఎక్కడైనా! అయ్యో రామ! తలకెక్కేను" అంటూ కట్లపీట మంచం దగ్గరికి లాక్కుంది రాధ.

"పిన్నిగారిని అడిగానండి! అన్నిసరుకులూ ఉన్నాయిట... ... ముసుగెట్టుకోకండి ...మంచి సంగతి చెబుతాను."

రామనాథం భార్యకేసి కళ్ళు విప్పి చూశాడు.

"ఎంచక్కా పాడుతుందండీ ఆవిడ! అష్టపదులన్నీ వొచ్చట గానీ, మరీ ఓ పాటంటే - అదేమిటో చెప్పిందండీ గుర్తుకు రావడం లేదూ!"

"స్మర సమరోచిత -" అని అందించాడు రామనాథం!

"అవును సుమా!" అన్నది రాధ హాయిగా నవ్వి. "ఆ అదే ఆ పాటంటే ఆవిడకెంతో ఇష్టమట! పదేపదే అదే పాడుతుంది. 'మావారిగ్గూడా ఆ పాటంటే ఇష్టమేనమ్మా! ఓ సారొచ్చి కరువుదీరా పాడి పోరాదా?' అన్నాను. 'అలాగే' అంది. ఏమిటి వింటున్నారా, నిద్ర పోతున్నారా?" అన్నది రాధ.

"రెండే" అన్నాడు రామనాథం.

"వినటమా, నిద్రపోవటమా?"

"రెండూ !"

రాధ ఆగి, నిట్టూర్చి పమిటతో చెమట తుడుచుకొంది.

"రాత్రికి భోజనానికి రమ్మన్నాను. భర్త వొప్పుకొన్నాడు గానీ, ఆవిడమాత్రం 'చూద్దాం' అంటూ చప్పరించేసింది. వస్తుంది లెండి ... ... మళ్ళీ కళ్ళు మూస్తున్నారు. నా కొంపతియ్యకండి బాబూ, మీకు పుణ్యముంటుంది" అన్నది రాధ ముసుగు లాగేస్తూ.

రామనాథం బద్ధకంగా కదిలి, అనవసరంగా ఆవలించి చిటిక వేశాడు.

"అలా ఏదన్నా కబుర్లాడుతూ ఉండండి. నేను నిమ్మరసం పిండి పులిహోర చేస్తాను. ఆవిడగారి భర్తకు పెందరాడే తినడం

అలవాటుట. ఇప్పటినుంచీ కుంపటి రాజేస్తేనేగాని —" అంటూ రాధ వెళ్ళిపోయింది.

"మరోసారి" అని నిశ్శబ్దంగా అనుకొన్నాడు రామనాథం...

దీపాలు పెట్టీపెట్టకముందే రాధ చిరచిరలాడుతూ వచ్చింది.

"ఏమిటీ?" అన్నాడు రామనాథం.

"వాళ్ళు వెళ్ళిపోయారు" అన్నది రాధ.

"అదేం?" అనగలిగాడు రామనాథం.

"భగవంతుడికి తెలియాలి. మధ్యాహ్నం నుండీ ఆవిడ గదిలోనుంచి రానే లేదుట. హఠాత్తుగా మొగుణ్ణి లేపి ప్రయాణ మయిందట. శేషగిరన్న య్యొచ్చేదాకనా్న ఉండమని, పిన్నిగారు పొరుకులాడినా వినిపించుకోలేదు. అదేం మనిషో, అదేం లోకమో?" అన్నది రాధ మెటికలు విరిచిపోసి "అంత ముసలివాణ్ణేసుకొని, ఈ జీబురు చల్లో..."

"ముసలివా డెవరు?"

"ఆవిడ మొగుడు"

రామనాథం గోడ కానుకోకపోతే పడిపోయి ఉండేవాడు ...

"అదేం, అప్పుడే లేస్తున్నారు ? వేపపూతవేసి చారు కాచాను మీకని. దాంతోనన్నా రెండు ముద్దలు తినండి మరి ! లేకపోతే ప్రాణం మరీ నీరసించి పోతుంది !"

అయిష్టంగా అన్నం కలిపాడు రామనాథం. ముద్ద మింగ బోతూ ఆగి "ముసలివాణ్నెలా చేసుకొందే ఆవిడ ?" అన్నాడు రామనాథం, ముద్దతో బాటు బాధను గూడా మింగుతూ.

ఆ అవిటికాలి తుమ్మ మొద్దుకు అంతకంటె మంచి మొగు డెలా వస్తాడండీ మీదంతా చోద్యం ! అదయినా అదృష్టం ఉండబట్టీ, భగవంతు డెందుకో గియ్యబట్టీనూ !''

రామనాథం తేరుకున్నట్లనిపించింది రాధకు.

''మరికొంచెం వడ్డిస్తాను. చారుతోనే భోం చెయ్యండి. ఈపూట మీకు మజ్జిగా గిజ్జిగా జాస్తానై'' అంటూనే రాధ వడ్డిం చేసింది. ''నేను బలవంతం చెయ్యకపోతే, ఇంత ఆకలితోనూ పడుకోనేవారేగదా ?''

రామనాథం పలక్కుండానే చెయ్యి కడుక్కొని వచ్చేశాడు. ఉదయంనుండీ తనుపడ్డ బాధను తలుచుకొని, తనలో తానే నవ్వు కొన్నాడు. ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా తనకీ చాదస్త మేమిటనిపించింది. నిజంగా తను అనుకొన్న వ్యక్తే అయితే, తనను చూడటానికి రాకపోవడంలో అర్థం లేదనిపించింది. ఇదెవరో నకిలీ మనిషి. తను పొరబడి అనవసరంగా, బాధపడి పోయాడు ...

రామనాథం మెల్లిగా తన పెట్టె తెరచి, ఒక్కో వస్తువునే కింద పెట్టాడు, అట్టడుగునున్న కాయితం వొత్తిగించి చూశాడు. అరలు వెదికాడు. సొరుగులు వెదికాడు. గుడ్డల మడతల్లో చూశాడు.

''ఏమిటండీ వెదుకుతున్నారు?'' అన్నది రాధ వెనగ్గా నుంచుని

రామనాథం చెమటలు తుడుచుకొంటూ ''ఓ చిన్న—'. అని ఆగిపోయాడు.

''ఇదేనా ?'' అంటూ రాధ ఆకుపచ్చరంగు కవరందించింది. ''మొన్న వెదుకుతుంటే కనిపించింది. మరేదో అనుకొని చూశాను. నలిగిన చామంతిపూలు, నీలం గాజుముక్కలు ఉన్నాయి. అందులో తిరిగి ఉంచుదామనుకొంటూనే బద్ధకించాను. ఇదిగో ...''

రామనాథం అందుకోలేక పోయాడు.

"నీదగ్గరే ఉంచు రాధా ! నువ్వు దాచినంత పదిలంగా, వాటిని నేను దాచ లేను" అన్నాడు రామనాథం.

"మధ్యాహ్నం ఆవిణ్ణి చూడగానే నాకీ సంగతి దృష్టి కొచ్చింది. ఆవిడకు చామంతిపూలంటే ఎంతో ఇష్టమట. ఇప్పటికీ గుత్తంగా, నీలంరంగు గాజులు తొడుక్కుంటుంది."

రామనాథానికి కనువిప్పయింది. తెరలు తొలగిపోయాయి. ఓ గొప్ప సత్యం అనుభవంలో కొచ్చి, మెదడులో దీపం వెలిగిన అనుభూతిని పొందాడు. కళ్ళు మూతలు పడ్డాయి. కనుకొలకుల్లో చేరిన తడి, దీపకాంతికి మిలమిలలాడి చెక్కిళ్ళపై జారి, నేలమీద పడి ఇంకిపోయింది.

—o—